


# 2 దయాగుణం

**నేపథ్యం:** మీరెప్పుడైనా ఇతర ప్రాణుల బాధను చూసి సమానుభూతి పొందారా ! ఈ పాఠంలో ప్రాణులపట్ల దయాగుణం కలిగి ఉండాలని తిలక్ ఏం చెప్పాడో తెలుసుకుందాం.



తిలక్ వేసవి సెలవుల్లో తాతగారి ఊరెళ్ళాడు. తన స్కూలు విషయాలు, ఊరి విషయాల గురించి తాతతో కబుర్లు చెప్పాడు. సాయంకాలం షికారుకు పంట పొలాలవైపు వెళ్ళాడు. అతనికి అక్కడ కొందరు పిల్లలు కనిపించారు. వారిలో కొందరు కుక్కలపైకి రాళ్ళు విసురుతూ వినోదిస్తున్నారు. మరికొందరు పిల్లలు తూనీగలను పట్టుకోడానికి గంతులేస్తున్నారు. ఇద్దరు పిల్లలు సీతాకోక చిలుకలను పట్టుకునేందుకు పరిగెడుతున్నారు.

అది చూసి తిలక్‌కు చాలా బాధ కలిగింది. చప్పట్లు కొట్టి వారిని తనవద్దకు రమ్మని పిలిచాడు. కొత్త అబ్బాయిని చూడగానే పిల్లలు పరుగెత్తుకొచ్చారు. అలా రావటంలో ఓ పిల్లవాడు కిందపడి పోయాడు. అతని కాలికి చిన్న గాయమైంది. ఏడవడం మొదలుపెట్టాడు.


తిలక్ పిల్లలకు తనను పరిచయం చేసుకున్నాడు. వారితో కబుర్లు చెప్పాడు. తర్వాత ఆ పిల్లవాడిని “ఎందుకలా

ఏడుస్తున్నావు? కాలు మంటగా ఉందా?'' అని అడిగాడు. ఆ పిల్లవాడు ఔనన్నాడు.

తిలక్ వారితో ''మనకు చిన్న గాయమైతే చాలు మంటతో అల్లాడి పోతాము. ఏడుస్తాము. ఆ కుక్కలను రాళ్ళతో కొడితే వాటికి కూడా మనలాగే దెబ్బ తగులుతుంది. తూనీగలను పట్టుకుంటే అవి తోకలు తెగి, బాధతో గిలగిలలాడుతాయి. సీతాకోక చిలుకలు రెక్కలు తెగితే విలవిలలాడుతాయి. వాటికీ మనలాగే ప్రాణముంది. బాధ, నొప్పి వుంటుంది. ఇంత పెద్ద శరీరం గల మనమే చిన్న గాయానికి తట్టుకోలేము. అంత చిన్న జీవులు ఎంత బాధ పడతాయో ఆలోచించండి? అలా చేయటం తప్పు. ప్రాణులపట్ల దయాగుణం కలిగి ఉండాలి'' అన్నాడు.

పిల్లలకు తిలక్ చెప్పింది అర్థమయింది. ''నిజమే ! బాధ అన్నది అన్ని ప్రాణులకు సమానమే ! ఇంకెప్పుడు ఇలాంటి పనులు చేయం'' అన్నారు పిల్లలు. తిలక్ మనసు ఆనందంతో ఉరకలు వేసింది.

**పశుపక్ష్యాదుల పట్ల దయ కలిగి ఉండాలి.**



## I. వినండి–చెప్పండి.

1. మీరు షికారుకు ఏయే ప్రదేశాలకు వెళ్ళారు ?
2. వేసవి సెలవుల్లో మీరు చూసిన ప్రదేశాలేవి ?
3. మీ తాతగారు ఏ ఊళ్ళో వుంటారు ?
4. ఊళ్ళో ఇంకా ఎవరెవరు ఉంటారు ?

## II. సంభాషించండి.

1. నీ స్నేహితునకు గాయమైతే నీవు ఏ విధంగా సహాయం చేస్తావు ?
2. ప్రథమ చికిత్స కొరకు ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి ?
3. సీతాకోకచిలుక, చిలుక, తూనీగ కాకుండ ఇంకా ప్రకృతిలో మీరు చూసే ప్రాణుల పేర్లు చెప్పండి.

## III. కొత్త పదాలు నేర్చుకుందాం.

వినోదం = సరదా, ఆనందం; గాయం = దెబ్బ; అల్లాడిపోవు = బాధపడు.

## IV. చదవండి-చెప్పండి-రాయండి.

### అ. సరియైన పదం గుర్తించి రాయండి.

1. తిలక్ షికారుకు వెళ్ళినది
   (అ) ఊరికి (ఆ) పంట పొలాలవైపుకు
   (ఇ) పార్కుకి (ఈ) సినిమాకు
2. ప్రాణులపట్ల కలిగి వుండవలసినది.
   (అ) దయాగుణం (ఆ) క్షమాగుణం
   (ఇ) కోపగుణం (ఈ) ఈర్ష్యాగుణం
3. తిలక్ మనసు ఉరకలు వేసింది.
   (అ) ఉత్సాహంతో (ఆ) ఆనందంతో
   (ఇ) ఆహ్లాదంతో (ఈ) ఉల్లాసంతో

### ఆ. ఒక్క వాక్యంలో జవాబులు రాయండి.

1. తిలక్ వేసవి సెలవుల్లో ఎక్కడికి వెళ్ళాడు ?
2. తిలక్‌కు ఎందుకు బాధ కలిగింది ?
3. పిల్లవాడు ఎందుకు ఏడ్చాడు ?
4. సీతాకోకచిలుక ఎందుకు విలవిలలాడింది ?

### ఇ. మూడు, నాలుగు వాక్యాల్లో జవాబులు రాయండి.

1. తిలక్‌కు పిల్లలు ఏం చేస్తూ కనిపించారు ?
2. తిలక్ పిల్లవాడిని ఏమడిగాడు ?
3. దయాగుణం గురించి తిలక్ ఏమన్నాడు ?
4. పిల్లలు తిలక్‌తో ఏమన్నారు ?

### ఈ. ఖాళీలను పూరించండి.

1. ఊరి విషయాల గురించి ________ తో కబుర్లు చెప్పాడు.
2. ________ అబ్బాయిని చూడగానే పిల్లలు పరుగెత్తుకొచ్చారు.
3. ________ రెక్కలు తెగితే విలవిలలాడుతాయి.

## V. భాషను తెలుసుకుందాం.

### అ. సొంతవాక్యాల్లో ఉపయోగించండి.

1. వినోదించు 2. అల్లాడిపోవు
3. గిలగిలలాడు 4. ఉరకలు వేయు

### ఆ. వాచకాలు గుర్తించండి.

1. పిల్లవాడు ఏడవడం మొదలుపెట్టాడు.
2. కుక్కలపైకి రాళ్ళు విసురుతూ వినోదిస్తున్నారు.
3. తిలక్ పిల్లలకు తనను పరిచయం చేసుకున్నాడు.

### ఇ. నామవాచకాలు, సర్వనామాలు, క్రియలు గుర్తించండి.


1. అతని కాలికి చిన్న గాయమైంది.
2. వారిని తన వద్దకు రమ్మని పిలిచాడు.
3. ప్రాణులపట్ల దయా గుణం కలిగి ఉండాలి.

**మేము సైతం.**
పశుపక్ష్యాదులను హింసించరాదనే నినాదాలతో ప్రచారం చేసే వీధి నాటకం వేస్తాం.

**నేనివి నేర్చుకున్నా.**
- ఏ ప్రాణిని హింసించరాదు.
- మన పొరపాట్లను సరిదిద్దుకోవాలి. ఇతరుల పొరపాట్లను సరిదిద్దాలి.

ఉ.సూ : ఇచ్చిన సూచనలను ఏకాగ్రతతో విని కృత్యమును ప్రత్యక్షంగా విద్యార్థులు చేసేటట్లు చూడండి.

## క్రియలు:




కింది వాక్యాలను చదవండి.

అతడు అన్నము తినుచున్నాడు.

ఆమె పాఠము రాయుచున్నది.

**ఉపా** : సీతా ! గీతగీసిన పదాలు దేనిని తెలియచేయుచున్నవి ?

**సీత** : పనిని తెలియచేయుచున్నవి.

**ఉపా** : వీటిని ఏమంటారో తెలుసా ?

**విద్య** : 'పని పదాలు'

**ఉపా** : అది సరియైనదే. కానీ వీటిని 'క్రియ'లు అనాలి. ఇవి రెండు రకాలు. 'పై వాక్యంలోని తినుచున్నాడు, రాయుచున్నది', అనునవి వాక్యం యొక్క పూర్తి అర్థాన్ని తెలియచేస్తున్నాయి కదా. అందువలన వీటిని **'సమాపక క్రియలు'** అంటారు. ఇప్పుడు ఈ కింది వాక్యాలను చదవండి

**విద్య** : వాడు అన్నము తిని

ఆమె పాఠము రాసి

వారు బంతితో ఆడుకొని

**ఉపా** : పై వాక్యాలలో 'తిని, రాసి, ఆడుకొని' అనునవి వాక్యం యొక్క పూర్తి అర్థాన్ని తెలియజేయడం లేదు, అందువలన వీటిని **'అసమాపక క్రియలు'** అంటారు.

* క్రింది వాక్యములలో గీతగీసిన పదాలు ఏ క్రియలో రాయండి.

1. వాడు పాఠమును చదివి, గృహపాఠము రాశాడు.
2. ఆమె పూలను కోసి, మాల కట్టుచున్నది.
3. ఆమె పాటను విని, మేము చాలా ఆనందించాము.

YBHICH

**వాచకములు :-**

పురుషులను తెలియచేయు పదాలను **"మహద్వాచకము"** అందురు.

ఉదా :- రమణ, నాన్న, అన్న, తమ్ముడు మొదలగునవి.

స్త్రీలను తెలియచేయు పదాలను **"మహతీవాచకములు"** అందురు.

ఉదా :- అమృత, అమ్మ, అక్క, వనజ మొదలగునవి.

స్త్రీలను, పురుషులను కాక మిగిలిన వానిని తెలియచేయు పదాలను **"అమహద్వాచకములు"** అందురు.

ఉదా :- పక్షి, బల్ల, గోడ మొదలగునవి.